క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామానికి చెందిన హరిజన ఈరన్న బైక్‌పై అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు సెబ్ సీఐ మహబూబ్ బాషా, ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. బుధవారం తుంగభద్రలో తనిఖీలు చేస్తుండగా ఈరన్న మద్యం బాటిళ్లతో పట్టుబడినట్లు చెప్పారు. ఆయన నుంచి 8 బాక్స్‌ల్లో 768 ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు లభించాయని, బైక్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. దాడుల్లో సెబ్ కానిస్టేబుళ్లు నాగరాజు, ఎస్.రాముడు, మధు, శ్రావణ్ ఉన్నారు.

టర్పెంటైన్ ఆయిల్ తాగి బాలుడికి అస్వస్థత



బాలుడితో తల్లిదండ్రులు

ఆదోని అర్బన్: తాగునీరు అనుకుని టర్పెంటైన్ ఆయిల్ తాగి ఐదేళ్ల బాలుడు అస్వస్థతకు గురైన ఘటన ఆదోని మండలం అలసంద గుత్తి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన సోమన్న, సంధ్య దంపతులకు కుమారుడు అఖిల్ (5) ఉన్నాడు. బుధవారం ఇంటికి రంగులు కొట్టేందుకు టర్పెంటైల్ ఆయిల్‌ను తీసుకొచ్చి ఇంట్లో ఉంచారు. బాలుడు అఖిల్ ఆడుకుంటూ నీరు అనుకుని తాగి అస్వస్థతకు గురయ్యాడు. అపస్మారక స్థితికి చేరుకున్న బాలుడిని హుటాహుటిన ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

వైభవంగా గుంటి రంగస్వామి రథోత్సవం



కటారుకొండలో గుంటి రంగస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ గ్రామ శివారులో వెలసిన గుంటి రంగస్వామి తిరునాలను గ్రామస్తులు రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని చూసేందుకు భక్తులు అధికసంఖ్యలో వచ్చారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. తిరునాల సందర్భంగా గ్రామంలో మిఠాయి, గాజుల దుకాణాలు వెలిశాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

తిరుమలనగర్‌లో పంచాంగ శ్రవణం



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలోని తిరుమలనగర్ శృంగేరి శంకరమఠంలో గరుడాద్రి దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా శారదాదేవికి సప్తపది తీర్థాలతో అభిషేకాలు చేశారు. మంగళవారం రాత్రి పంచాంగ శ్రవణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీశారదాదేవి శంకరాచార్యుల పల్లకీసేవ జరిగింది. కార్యక్రమంలో శారదా శంకరమఠం విచారణకర్త కృష్ణదేవరాయలు, భారతీతీర్థ ఉద్యానవన కమిటీ సభ్యులు వసంత, రాఘవేంద్ర, గోవింద రాజులు, రఘురామయ్య, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పారువేట ఉత్సవం



శ్రీరంగనాథుడి పల్లకీ ఊరేగింపు

మద్దికెర: పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ఉగాది సంబరాలలో భాగంగా బుధవారం పారువేట ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి బిందెసేవ చేపట్టారు. సాయంత్రం స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతుడై గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా గోదా చెరువుకు వెళ్లారు. చెరువులో కుందేళ్లను వదిలి పట్టుకునే పారువేట కార్యక్రమం జరిపించారు.

అమ్మకు అభయం

- గర్భం దాల్చినప్పటి నుంచే ప్రభుత్వ పర్యవేక్షణ
- ప్రసవించే వరకు క్రమం తప్పకుండా వైద్యసేవలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏటా 50 వేల ప్రసవాలు
- వంద శాతం ఆసుపత్రుల్లోనే కాన్పులు
- నేడు జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం

బిడ్డను కంటూ ఏ తల్లీ, జన్మిస్తూ ఏ బిడ్డా మరణించకూడదన్నది రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశం. అందుకనుగుణంగా మహిళలకు గర్భం దాల్చిన ప్పటి నుంచే ఆరోగ్య సూచనలు అందిస్తూ, ప్రసవించిన తర్వాత తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం అహర్నిశలు కృషి చేస్తోంది. మహాత్మాగాంధీ సతీమణి కస్తూర్బా గాంధీ జయంతిని పురస్కరించుకుని 2003 నుంచి ఏటా ఏప్రిల్ 11న జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో 'సాక్షి' ప్రత్యేక కథనం..



కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఆదోనిలోని ఏరియా ఆసుపత్రి, మాతాశిశు ఆసుపత్రి, కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నింటిలోనూ ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. గర్భిణి తన ఇష్టమైన ఆసుపత్రిలో చేరి సుఖప్రసవం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటోంది. గర్భం దాల్చిన ప్రతి మహిళ పేరును వైద్య సిబ్బంది యాప్‌లో పేరు నమోదు చేయించి, ప్రసవం అయ్యేంతవరకు పర్యవేక్షిస్తున్నారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి మాతృమరణాలను అరికడుతున్నారు.

మాతృత్వ పథకాలు

జననీ సురక్ష యోజన: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాల గర్భిణులు ఆసుపత్రిలో ప్రసవిస్తే ఆమె బ్యాంకు ఖాతాకు నగదును జమ చేస్తారు.

ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్: ప్రతి నెలా 9న సీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. గర్భధారణ వ్యవధిలో 3 నుంచి ఆరు నెలల వరకు మాత్రమే ఈ పరీక్షలు నిర్వహిస్తారు. హైరిస్క్ గర్భిణులకు ప్రత్యేక వైద్యసేవలు అందిస్తారు.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మాతాశిశు కేంద్రం

సుమన్: మాతాశిశు మరణాలను తగ్గించేందుకు సురక్షిత్ మాతృత్వ ఆశ్వాసన్(సుమన్) పథకాన్ని 2019 అక్టోబర్‌లో ప్రారంభించారు. పేరు నమోదు చేసుకున్న గర్భిణులకు ప్రసవం తర్వాత ఆరు నెలల వరకు తల్లీబిడ్డకు ఎలాంటి అనారోగ్య సమస్యలు వచ్చినా ఉచితంగా చికిత్స అందిస్తారు. ఇంటి నుంచి వైద్యశాలకు ఉచిత రవాణా సౌకర్యం కూడా కల్పిస్తారు.

ప్రధానమంత్రి మాతృవందన యోజన: మూడు విడతల్లో గర్భిణికి ఆర్థిక సాయం అందజేస్తారు. గర్భిణిగా పేరు నమోదు చేసుకున్న తర్వాత తొలివిడగా రూ.1,000, రెండో విడతగా ఆరు నెలల తర్వాత ఆరోగ్య పరీక్షల నిమిత్తం మరో రూ.2వేలు, ప్రసవం అనంతరం శిశువు, తల్లి ఆరోగ్య రక్షణకు చివరి విడతగా రూ.2 వేలు అందజేస్తారు.

మాతృమరణాలు తగ్గుముఖం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల కారణంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత నాలుగేళ్లలో మాతృమరణాలు తగ్గుముఖం పట్టాయి. 2019-20లో 63,453 మంది ప్రసవించగా 40, 2020-21లో 62,817 మంది ప్రసవించగా 28 మంది, 2021-22లో 46,586 మంది ప్రసవించగా 30 మంది, 2022-23లో 51,142 మంది ప్రసవించగా 13 మంది, 2023-24లో కేవలం కర్నూలు జిల్లాలో మాత్రమే 28,970 మంది ప్రసవించగా 10 మంది మాత్రమే మృతిచెందారు.

పెరిగిన ఆసుపత్రి ప్రసవాలు

ప్రతి గర్భిణీ ఆసుపత్రిలోనే పురుడు పోసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తద్వారా 2019-20లో 63,143(99.49శాతం), 2020-21లో 62,800(99.47శాతం), 2021-22లో 46,701(99.90శాతం), 2022-23లో 51,402, 2023-24లో కేవలం కర్నూలు జిల్లాలో 28,108 ప్రసవాలు ఆసుపత్రుల్లోనే జరిగాయి.

రక్తహీనత నివారణకు చర్యలు

రక్తహీనత నివారణకు గర్భం దాల్చిన వెంటనే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇస్తున్నారు. తీవ్ర రక్తహీనత ఉన్న గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఎక్కిస్తున్నారు. 7 శాతం లోపు ఉంటే వారికి రక్తం ఎక్కించి ప్రసవ సమయంలో ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. 2019-20లో 75,059(95.67శాతం) మందికి, 2020-21లో 84,372(100.44శాతం) మందికి, 2021-22లో 47,994(103.71శాతం) మందికి, 2022-23లో 50,270(96.5శాతం) మందికి, 2023-24లో కేవలం కర్నూలు జిల్లాలో 31,208(98శాతం) మందికి ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేశారు.

మాతృమరణాలు అరికడతాం



హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించి మాతృ మరణాలను అరికడతాం. వైద్యాధికారి నుంచి ఏఎన్ఎం వరకు గర్భిణిని పర్యవేక్షించి వారం ముందుగానే ఆసుపత్రిలో చేర్పించి సుఖప్రసవమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. మాతృమరణాలపై ప్రతి నెలా సమీక్ష నిర్వహించుకుని పొరపాట్లు పునరావృతం గాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి

ఆదోని రూరల్: ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. బుధవారం స్థానిక ఫంక్షన్ హాలులో ఎన్నికల విధుల్లో పాల్గొనే పీఓ, ఏపీఓ, ఓపీఓ, ఆర్‌ఓ, ఏఆర్‌ఓ, సెక్టర్ ఆఫీసర్‌లు, జోనల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, మైక్రో అబ్జర్వర్‌లు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, ఈఈఎం టీం సభ్యులు, వీడియోగ్రాఫర్లు, కంట్రోల్ రూమ్, ఇతర అన్నిశాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది విధిగా ఫారం-12ను దరఖాస్తు చేసుకుని సంబంధిత నియోజకవర్గ ఆర్‌ఓకు లేదా నియోజకవర్గ కేంద్ర తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్‌కు అందజేయాలని సూచించారు. ఫారం-12 దరఖాస్తుతో పాటు ఎన్నికల విధులను కేటాయిస్తూ జారీ చేసిన నియామక ఉత్తర్వు, ఓటర్ గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలను జత చేయాలన్నారు. ఈనెల 13వతేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలన్నారు. ఏవీఈఎస్ (నిత్యావసర సేవల్లో ఉన్న ఉద్యోగులు) కేటగిరికి సంబంధించి పోలింగ్ రోజున విధుల్లో ఉంటూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 33 శాఖలకు ఈ అవకాశాన్ని కల్పించడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న సిబ్బందికి పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు అవకాశం ఉండదన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ



హాజరైన అధికారులు

ఎన్నికల ప్రక్రియపై పీఓలకు శిక్షణ

ఆదోని రూరల్: పోలింగ్ సమయంలో పూరించాల్సిన 17సీ, పీఓ డైరీ, పీఓ రిపోర్ట్‌లతో పాటు ఈవీఎం కనెక్షన్‌పై ఎన్నికల సిబ్బందికి స్పష్టమైన అవగాహన ఉండాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. బుధవారం ఆదోనిలోని రోషన్ గార్డెన్ హాల్‌లో ఎన్నికల నిర్వహణపై ఆదోని నియోజకవర్గ పరిధిలోని పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదోని నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పీఓ, ఏపీఓలకు ఇటీవల జిల్లాస్థాయిలో శిక్షణ ఇచ్చారని తెలిపారు. నియజకవర్గ స్థాయిలో మరోసారి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈవీఎం కనెక్షన్, డిస్కనెక్ట్ విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలింగ్‌కు ముందు రోజు మరోసారి శిక్షణ ఉంటుందన్నారు. ఆదోని తహసీల్దార్ హసీనా సుల్తానా, డీఎల్‌పీఓ కార్యాలయ పరిపాలనాధికారి వీరభద్రప్ప, ఉప తహసీల్దార్‌లు రుద్రగౌడ్, వలీబాషా, మాస్టర్ ట్రైనర్లు ఆదిమూర్తి, సుధాకర్ పాల్గొన్నారు.



ఈవీఎం, వీవీప్యాడ్‌ల పనితీరును వివరిస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఘనంగా వసంతోత్సవం

హొళగుంద: మండలంలో బుధవారం ఉగాది కరి పండుగ (వసంతోత్సవం) ఘనంగా జరుపుకున్నారు. ఉగాది పండుగ మరుసటి రోజు జరిగే కరి పండుగ నాడు ఈ ప్రాంతంలో హోలీ ఆడడం సాంప్రదాయంగా వస్తోంది. అందులో భాగంగా ఆయా గ్రామాలలో చిన్నారులు, యువకులు చిన్నా పెద్ద తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగు నీళ్లు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. పిండివంటలు, విందు భోజనాలతో కరి వేడుకను సంబరంగా చేసుకున్నారు. ఉగాది కరి పండుగను చెడు దినంగా భావించే ఇక్కడి ప్రజలు పనులన్నీ వాయిదా వేసుకుని ఇంట్లోనే కాలక్షేపం చేశారు.

వాటర్ బెల్ తప్పనిసరి

ఆలూరు రూరల్: అధిక ఎండలకు విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా పాఠశాలల్లో వాటర్‌బెల్ కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని ఎంఈఓ కోమలాదేవి సూచించారు. ఆమె బుధవారం మాట్లాడుతూ.. తరగతి గదిలో ఉండే విద్యార్థులు వడగాలులకు డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు విద్యా శాఖ వాటర్‌బెల్ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఉదయం 8.45 గంటలకు, 10.50 గంటలకు, 11.50 గంటలకు మూడు సార్లు వాటర్ బెల్ మోగించాలని, ఆ సమయంలో విద్యార్థులు నీరు తాగేందుకు ఐదు నిమిషాలు బ్రేక్ ఉంటుందన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీ చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో చేరిన 60 దూదేకుల కుటుంబాలు

ఆదోని టౌన్: దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌సయ్యద్‌బాజీ ఆధ్వర్యంలో ఆదోని నియోజకవర్గానికి చెందిన 50 దూదేకుల కుటుంబాలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు వారు తెలిపారు. దూదేకుల అభివృద్ధి, సంక్షేమం కోసం జగనన్న ప్రత్యేకంగా జీవోను విడుదల చేశారన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామన్నారు. ప్రజలకు మేలు జరగాలన్నా.. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. 14 ఏళ్ల టీడీపీ పాలనలో రాష్ట్రానికి చంద్రబాబు చేసిందేమి లేదన్నారు. వైఎస్సార్ హయాంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. నవరత్నాల పథకాలతో అన్ని వర్గాల అభ్యున్నతికి వైఎస్ జగన్ కృషి చేశారని తెలిపారు. దూదేకుల సంఘం నాయకులు రంజాన్‌బాషా, మహబూబ్‌బాషా, మస్తాన్‌వలి, నజీర్, బషీర్, మహ్మద్ పాల్గొన్నారు.

ఇందిరానగర్ వాసులు

పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన 10 దూదేకుల కుటుంబాలు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరిలో సత్తార్ బాషా, మహ్మద్, నజీర్, నబీ, పెద్ద దస్తగిరి, చిన్నదస్తగిరి, సలీం, వలీ, మహబూబ్‌బాషా, సుభాన్ ఉన్నారు. వార్డు కౌన్సిలర్ చలపతి ఉన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

కౌతాళం: మండల కేంద్రంతో పాటు, వివిధ గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రప్ప, జగదీష్ కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండలంలోని చాలా గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అధికారులు ముందు జాగ్రత్త తీసుకోకుండా నిర్లక్ష్యం చేయడంతో సమస్య జఠిలమైందన్నారు. 8 రోజులకు, 10 రోజులకొకసారి కుళాయిలకు నీరు సరఫరా చేస్తున్నారని, సమృద్ధిగా నీరు రాక జనం అవస్థలు పడుతున్నారన్నారు. కోశాధికారి హనుమంతు, కార్యదర్శి ఉలిగయ్య, ఉపాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

13న సీతారాముల కల్యాణం

కర్నూలు కల్చరల్: ఈనెల 13న మున్సిపల్ ఎగ్జిబిషన్ హైస్కూల్ గ్రౌండ్‌లో సీతారాముల కల్యాణం ఉంటుందని ఉత్సవ సమితి అధ్యక్షులు కె.క్రిష్ణన్న తెలిపారు. బుధవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం 6 గంటలకు గోశాలలో తలంబ్రాల సేవ, శుక్రవారం స్వామి వార్లకు తిరుమంజన సేవ ఉంటుందన్నారు. శనివారం సాయంత్రం సీతారాముల కల్యాణం ఉంటుందన్నారు. సమితి ఉపాధ్యక్షులు ఎస్వీ నారాయణరెడ్డి, మహాబలేష్, కార్యదర్శి ఎమ్.నాగోజీరావు, కోశాధికారి కల్కిమురళి పాల్గొన్నారు.

రమణీయం రథోత్సవం



తారాపురంలో అశేష భక్త జనుల మధ్య సాగుతున్న రథోత్సవం

- శ్రీరామ నామస్మరణతో మారుమోగిన తారాపురం

పెద్దకడబూరు : మండలంలోని తారాపురం గ్రామంలో వెలసిన శ్రీ గిడ్డాంజనేయస్వామి రథోత్సవం బుధవారం రమణీయంగా సాగింది. పెద్దకడబూరు, ఆదోని చుట్టుపక్కల నుంచే గాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన భక్తులతో గ్రామం కిటకిట లాడింది. జై శ్రీరాం నామస్మరణతో గ్రామం పులకించిపోయింది. తెల్లవారుజామున ఆలయ అర్చకులు స్వామి వారికి జలాభిషేకం, పాలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, పుష్పార్చన, మహా మంగళహారతి వంటి పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పిండి వంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ముందుగా గౌళ్ళ వీరారెడ్డి ఇంటి నుంచి కుంభం ఊరేగింపుగా రథం వరకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఓంకారప్పస్వామి ఇంటి నుంచి ఉత్సవమూర్తులు, గజమాలతో ఊరేగింపుగా వచ్చి ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేశారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య, జైశ్రీరాం నామం పఠిస్తూ తిమ్మప్ప తాత గుడిదగ్గరికి లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మహేష్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉరుకుంద ఈరన్నస్వామి ట్రస్ట్ బోర్డు సభ్యుడు విజయేంద్రరెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, భీమ్‌సేన్‌రావ్ కౌశిక్, అనుమేష్‌స్వామి రథోత్సవంలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గిడ్డాంజనేయస్వామి

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో 32 మంది వార్డు వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను వార్డు సచివాలయ అడ్మిన్‌లకు అందజేశారు. వాటి ఆమోదం కోసం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి ప్రభుత్వానికి సిఫారసు చేశారు. 12వ వార్డులో మహేష్, రాధిక, వీరశేఖర్, గుల్జార్‌బేగం, యల్లమ్మ ఉన్నారు. 21వ వార్డులో వంశీ, పవిత్ర, కవిత, సాయిప్రియ, రేణుక, అశోక్, దీప్తి, ఉషాప్రియ, యాస్మిన్, శాంతి, 23వ వార్డులో ప్రమీల, సునీత, లక్ష్మి, మంజుల, శాంతి, విజయలక్ష్మి, సునీత, ఉషా, కవిత, అయేషాభాను, అనిత, పార్వతి, శాంతి, 28వ వార్డులో శివ, 23వ వార్డులో సలాం, 24వ వార్డులో సరళ, 17వ వార్డులో వైష్ణవి, రేణుక, గోపీ, భారతి, ప్రియాంక, రాజ్‌భరత్, ఫజిల్‌నిషాబేగం, ఆనంద్, మణి, కీర్తి, రవిరాజు, మంగమ్మ, లక్ష్మీపార్వతి, నాగమ్మ, రాంప్రసాద్ ఉన్నారు.

కోసిగి: మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న 34 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సిరాజ్ అహ్మద్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గెలుపు కోసం రాజీనామాలు అందజేసినట్లు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ మాట్లాడుతూ రాజీనామాలను జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



రాజీనామా పత్రాలను అడ్మిన్‌కు సమర్పిస్తున్న 17వ వార్డు వలంటీర్లు

ఆదోని రూరల్: ఆదోని మండలం ధణాపురం గ్రామానికి చెందిన 10 మంది వలంటీర్లు, బైచిగేరి గ్రామంలో 7 మంది రాజీనామా చేశారు. బుధవారం తమ రాజీనామా పత్రాలను ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయశేఖర్‌రావుకు అందజేశారు. వీరిలో ధణాపురం గ్రామానికి చెందిన షమీర్, శివప్రకాష్, లక్ష్మణ్, విజయ్‌కుమార్, నరసింహులు, బంగారప్ప, వీరేష్, సౌమ్య, అంజినమ్మ, చిట్టెమ్మ ఉన్నారు. అలాగే బైచిగేరికి చెందిన రంగన్న, రవికుమార్, నాగలక్ష్మి, అంకిత, నాగవేణి, విశ్వనాథ్, దశరథ ఉన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వలంటీర్ వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని.. అందుకే రాజీనామా చేస్తున్నామని తెలిపారు. మరోసారి జగనన్న ప్రభుత్వం వస్తే సేవా దృక్పథంతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.



సీనియర్ అసిస్టెంట్‌కు రాజీనామా పత్రం అందజేస్తున్న వలంటీర్లు



ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయశేఖర్‌రావుకు రాజీనామా పత్రాలను అందజేస్తున్న ధణాపురం వలంటీర్లు

శ్రీరాముడు సర్వమానవాళికి ఆదర్శం

కర్నూలు కల్చరల్: మానవుడు సమాజంలో ఎలా నడుచుకోవాలో తాను ఆచరించి చూపిన ఆదర్శ మూర్తి కాబట్టే శ్రీరాముడు సర్వమానవాళికి ఆరాధ్య దైవం అయ్యాడని తెలుగు పండితులు, ధార్మిక ఉపన్యాసకులు డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని అన్నారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో శ్రీరామ నవమి విశిష్టతపై ఉపన్యసించారు.